ప్రజాశక్తి

శనివారం 8 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అధ్వానంగా రహదారులు



దుగ్గిరాల-ఈమని రహదారి దుస్థితి

- చిన్నపాటి వర్షాలకే అస్తవ్యస్తం
- గోతులు, గుంతలతో నరకయాతన
- మరమ్మతులకు నోచక ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలతో రోడ్ల పరిస్థితి మరీ అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రధానంగా డెల్టా ప్రాంతంలోని పలు మార్గాల్లో ప్రయాణానికి వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారు. గుంటూరు-పేరేచర్ల వయా పెదపలకలూరు రోడ్డు పరిస్థితి ఇప్పటికీ మెరుగుపడలేదు. దుగ్గిరాల-ఈమని మధ్య రహదారి బాగా దెబ్బతింది. రహదారిపై ప్రయాణం చాలా కష్టంగా ఉందని వాహనదారులు అంటున్నారు. ఈ గుంతలు రోడ్డుపై ఎప్పుడు ఎలాంటి



గుంటూరు నగరంలోని పట్నం బజారు దుస్థితి

ప్రమాదం జరుగుతోందని వాహనదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొల్లిపర-తెనాలి మార్గంలో భారీ గోతులు ఏర్పడ్డాయి. శిరిపురం మార్గంలో రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. శిరిపురం నుంచి తెనాలి వరకు 10 కిలో మీటర్ల మేరకు రహదారి సరిగా లేకవాహనదారులు యాతన పడుతున్నారు.

గుంటూరు-విజయవాడ రహదారిపై గుంతలు ఏర్పడినా కనీసం పూడ్చడం లేదు. గుంటూరు-పొన్నూరు రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

గుంటూరులోని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినా అధికారులు దృష్టిసారించడం లేదు. వ్యాపార కూడలి పట్నం బజారులో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచి కాలుతీసి కాలు వేయలేని

2లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్

రాజకీయ లబ్ధి కోసం యుసిసి చిచ్చు

- ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బిజెపి మరో కుట్ర
- ఉమ్మడి పౌరస్మృతిని అన్ని పార్టీలూ వ్యతిరేకించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తేవాలని చూస్తున్న ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ - యుసిసి)ని అన్ని రాజకీయ పార్టీలూ వ్యతిరేకించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యుసిసిని వ్యతిరేకిస్తూ వాపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని ఎన్‌జిఒ హోంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ వి.కోటానాయక్ అధ్యక్షత వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉమ్మడి పౌరస్మృతిని రాజకీయ లబ్ధికోసం బిజెపి నేతలు ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పౌరస్మృతి మైనారిటీలపై అధిక ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. వారికున్న ప్రత్యేక హక్కులు బలహీనపడే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కుట్రలకు పాల్పడుతున్న బిజెపిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ప్రజలందరూ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓటు

2లో



చీపురుపట్టిన జిజిహెచ్ సూపరింటెండెంట్

అపరిశుభ్రత, అస్తవ్యస్త పార్కింగ్‌పై ఆగ్రహం

దుకాణాల్లో అధిక ధరలపై హెచ్చరిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పరిశుభ్రతపై సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ దృష్టి సారించారు. శుక్రవారం ఆయనే స్వయంగా చీపురుపట్టి ఊడ్చారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే ముస్తఫా ఉచిత మినరల్ వాటర్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న వాతావరణాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన

2లో



ఇరిగేషన్ ఇఇ కార్యాలయం వద్ద బైటాయించిన రైతులు, నాయకులు

ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - తెనాలి

రైతు సమస్యలపై అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. భారీ వర్షాలకు ఐతానగర్, నేలపాడు తేలప్రోలు, కంచర్లపాలెం ప్రాంతాల్లో వెద వారినారు నీట మునగడంపై ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు నిరసన చేపట్టారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో దాదాపు 80 శాతం మంది కౌలు రైతులేనని, వారంతా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏటా నష్టపోతున్నారని చెప్పారు. ప్రస్తుతం తెనాలి పరిధిలో ఐదు వేల ఎకరాల్లో వెదపెట్టిన వరినారు నీటి పాలైందన్నారు. వేసవిలోనే కాల్వలు పూడికలు తీయించాల్సిన అధికారులు ఆ పనులకు ఇప్పుడు టెండర్లు పిలవటం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.10 వేలకు పైగా నష్టపోయారని, ఈ మొత్తాన్ని రైతులకు నష్టపరిహారంగా చెల్లించడంతోపాటు మళ్లీ సాగుకు విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఐతానగర్ అధ్యక్షులు ఈదర పూర్ణచంద్ర మాట్లాడుతూ అధికారుల మొండి వైఖరి కారణంగా ప్రతి ఏట రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈ ఎస్.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, వి.రోశయ్య, ఇ.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, టి.రవిచంద్ర, ఇ.బుచ్చిబాబు పాల్గొన్నారు.



మంగళగిరిలో నిరసన తెలుపుతున్న నాయకులు

అవినాష్ గుప్తాను కఠినంగా శిక్షించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో తీవ్రంగా ఖండించిన ఐక్యకార్యాచరణ కమిటీ

రేపు నిరసనలకు పిలుపు - మంగళగిరిలో నిరసన ప్రదర్శన - తహశీల్దార్‌కు వినతి

5లో



మా ఊరి నీరంతా తరలించారు

దొండపాడు గ్రామస్తుల ఆందోళన

2లో



ధృవీకరణ పత్రం ఇచ్చి, సన్మానిస్తున్న నాయకులు

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షులు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేట జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎన్నికల కమిటీ అధికారులు కోన దేవదాసు, ఎస్ఎం సుభాని, వివి రమణ, మల్లికార్జున్‌ల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా పివి సుబ్బారెడ్డిని ఎన్నికయ్యారు.అనంతరం జరిగిన అభినందన సభలో గుంటూరు, ప్రకాశం జిల్లా గ్రంథాలయాల సంస్థల అధ్యక్షులు బత్తుల దేవానంద్, ఆర్.పిచ్చయ్య, ఏపీజిఎఫ్ కో చైర్మన్ ఏ భాస్కర్ రెడ్డి, కో-కన్వీనర్ మురికిపూడి దేవపాల్, రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు తోట నరసింహారావు, కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా సుబ్బారెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు, సంఘ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గృహనిర్మాణ శాఖ రిటైర్డ్ పీడీ బసవయ్య గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-గుంటూరు

గృహ నిర్మాణ శాఖ జిల్లా ఇన్‌చార్జి పీడీగా పనిచేసి, పదవీ విరమణ పొందిన కొల్లూరు బసవయ్య శుక్రవారం తెనాలిలో గుండెపోటుతో మరణించారు. స్వగ్రామం ముల్పూరు వెళ్లి, తెనాలిలోని ఇంటికి తిరిగి వచ్చి, మధ్యాహ్నం భోజనం తర్వాత గుండెపోటు వచ్చింది. హుటాహుటిన బంధువులు బసవయ్యను తెనాలిలో ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భౌతిక ఖాయాన్ని మంగళగిరి ఎన్ఆర్ఐ మార్చురీలో ఉంచారు. వారి పిల్లలు అమెరికా నుండి వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి-ఈపూరు

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఎమ్మా ర్పీఎస్ పనిచేస్తుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రెడ్డి బోయిన ప్రసన్నకుమార్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీలలో ఉంచబడిన 59 ఉప కులాలకు 15 శాతం రిజర్వేషన్ల లబ్ధి కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ద్వారానే ఎస్సీ మాదిగలకు ఉప కులాలకు సామాజిక న్యాయం,ఆర్థిక న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి రమేష్, కె దేవా, ఎం కోటయ్య, బి ప్రకాష్, జి మహేష్, బి సుధాకర్, ఎస్ ముసలయ్య పాల్గొన్నారు.

మా ఊరి నీరంతా తరలించారు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణ ప్రజల కోసమని అడిగితే తమ ఊరి చెరువు నుండి నీరిచ్చామని, తీరా ఆ పేరుతో చేపల వ్యాపారులతో కుమ్మక్కై మా గ్రామానికే నీరు లేకుండా తరలించుకుపోయారని దొండపాడు గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామంలోని చెరువు వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. దొండపాడులోని 1400 ఎకరాల్లోని చెరువు చేపల చెరువు కావడంతోపాటు ఆ చెరువు నుండే స్థానికులు ఇంటి అవసరాల కోసం నీటిని వాడుకుంటూ ఉంటారు. ఈ చెరువు సుమారు ఏడు అడుగులు ఉండడంతో ఈ చెరువులో నీటినే గేదెల కోసం, ఇళ్లల్లో ఇతర అవసరాలకు వాడుకోవడానికి గ్రామస్తులు ఉపయోగిస్తున్నారు. దీంతోపాటు ప్రధానంగా ఈ చెరువు కింద 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు వల్లే ఇక్కడ భూగర్భ జలాలు వృద్ధి చెందుతూ గ్రామంలో తాగు, సాగు అవసరాలకూ ఉపయోగపడుతున్నాయి.





ఈ క్రమంలో వినుకొండ పట్టణ ప్రజల కోసమని ఈ చెరువు నుండి నీటిని తరలించడానికి మున్సిపల్ అధికారులు సంప్రదించగా ఒక్క అడుగు నీటిని తీసుకోవడానికి గ్రామం అంగీకరించింది. అయితే ప్రజాప్రతినిధులు, మున్సిపల్, అధికారులు కలిసి చేపల వ్యాపారులతో కుమ్మయ్యారని, చెరువులో మూడు అడుగుల వరకూ నీటిని తరలించుకుపోయారని స్థానికులు బత్తుల గోవిందు, గుంట గోవిందరాజులు, నాగేశ్వరరావు, ఇతర మహిళలు ఆవేదన వెలిబుచ్చారు. ఈ చర్యల వల్ల తమ గ్రామ అవసరాలు తీరకపోవడతోపాటు వ్యవసాయ అవసరాలకూ నీరు లేదని మండిపడ్డారు. ఇది తమకు తీరని అన్యాయమన్నారు. ఇప్పుడున్న నీటినైనా తాము కాపాడుకోకుంటే గొడ్డు.. గోదా.. పిల్లా.. పాప.. అంతా అవస్థ పడాల్సి వస్తుందని అన్నారు. చేపల చెరువు సొసైటీ వదులుకునేందుకైనా సిద్ధమని, తమకు నీటిని మాత్రం దూరం చేయొద్దని కోరారు. ఇకమీదట అనధికారికంగా తరలిస్తే అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. ఈ చెరువులో రూ.10 కోట్ల చేప పిల్లలు వేసి రూ.25 కోట్ల వ్యాపారం చేశారని, సొసైటీ సభ్యులకు రూ.రెండు మూడు వేలిచ్చి సరిపెట్టిన వ్యాపారులు మిగతా ఆదాయాన్ని మొత్తం దోచుకుంటున్నారని, ఈ చేపల చెరువు ద్వారా వ్యాపారం చేసిన వ్యక్తి ఈ ప్రాంతంలోనే 3 వేల ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. తామంతా వ్యవసాయం ఆధారంగా బతుకుతున్నామని, ప్రస్తుతం నాగార్జునసాగర్ డ్యాంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీలో ఉండటం వలన నీరు వచ్చే అవకాశం లేదని చెప్పారు. ఇప్పుడు తాము వ్యవసాయం చేయాలంటే చెరువు నీరు ఆధారమన్నారు.

1వ డివిజన్‌లో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక షాప్ ఎంప్లాయీస్ కాలనీ, వైఎస్ఆర్ పార్క్ వద్ద శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్ సజిలా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గత వారం రోజుల నుండి 1వ వార్డులో వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ పథకాలకు లబ్దిదారుల అర్హుల వివరాలు, అవసరమైన ధ్రువపత్రాల ఆర్జీలను సేకరించారన్నారు. డివిజన్ పరిధిలో వివిధ అంశాలకు సంబంధించి 12 వందల అర్జీలు, దరఖాస్తులు అందగా, వాటిలో సుమారు 800లకు ఆమోదం తెలిపి సర్టిఫికెట్స్ అందిస్తున్నామన్నారు. మిగిలినవి కూడా త్వరలో అందిస్తామన్నారు. అలాగే డివిజన్ పరిధిలో సుమారు రూ.9.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు అయినట్లు కమిషనర్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి ముందుకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ప్రసంగించారు. అనంతరం లబ్దిదారు లకు ధృవపత్రాలు అందచేశారు. శుక్రవారం గుంటూరు నగరంలో షాప్ ఎంప్లాయిస్ కాలనీతోపాటు, స్తంభాల గరువులోని రెడ్డిహాస్టల్, రామిరెడ్డితోట, శ్రీనివాసరావుతోట, వేణుగోపాల్ నగర్, నల్లపాడులో క్యాంపులు జరిగాయని, వీటిల్లో 8,631 దరఖాస్తులను పరిశీలించి, నిర్దేశిత పత్రాలు ఉన్న వారికి సర్టిఫికెట్స్ అందించినట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందచేస్తున్న కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు

చీపురుపట్టిన జిజిహెచ్ సూపరింటెండెంట్

(మొదటి పేజీ తరువాయి)

సూపరింటెండెంట్ స్వయంగా చీపురుమట్టి ఊడ్చారు. బండలను కడిగి శుభ్రపర్చారు. ఆస్పత్రిని దేవాలయంగా మార్చండి.. బూత్ బంగ్లాగా మార్చొద్దు అని అధికారులపై మండిపడ్డారు. ఆస్పత్రిలో దుకాణాలను తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తే సహించనని చెప్పారు. సంగం డెయిరి షాపులో అధిక రేట్లకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆసుపత్రిలో అస్తవ్యస్తంగా మారిన పార్కింగ్‌పై మండిపడ్డారు. ఆసుపత్రి ఎదురుగా ఉన్న రైల్వే స్టేషన్లో పార్కింగ్ ఎలా ఉంది. మన దగ్గర ఎలా ఉంది.. అంటూ సెక్యూరిటీ సూపర్‌వైజర్లను ప్రశ్నించారు. ఎవరి వాహనాలైనా పార్కింగ్ ప్రదేశాల్లో పెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనాలన్నీ ఆసుపత్రి ప్రహరీకి ఆనుకుని ఉన్న ప్రదేశాల్లో పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంఒను ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసు, కొత్తపేట పోలీసులతో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి ఆవరణలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని సందర్శించి విద్యుత్ హెచ్చు తగ్గులు వస్తున్నాయని, సరి చేయాలని ఆదేశించారు. యూనియన్ నాయకులు ఎవరికి వారే షెడ్‌లు వేసుకోవడంపై అభ్యంతరం తెలిపారు. మార్చురి వద్ద అడ్డంగా పెట్టిన ప్రైవేట్ అంబులెన్స్‌లను తొలగించాలని ఆదేశించారు. మహాప్రస్థానాల నిర్వహణను ఆర్ఎంలకు కేటాయించాలని సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్‌కుమార్‌ను ఆదేశించారు. వాహనాలు ఎప్పుడు బయటకు వెళుతున్నాయో వాటిపై నిఘా పెట్టాలన్నారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్ఎంఒ వై.రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, పరిపాలన అధికారి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

రాజకీయ లబ్ధి కోసం యుసిసి చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ప్రతిఘటించేందుకు వామపక్షాలు, ప్రజా సంఘాలు ఏకమై చైతన్యం నింపాలని అన్నారు. యుసిసికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలూ ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎన్.రామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, కెవిన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, రాణి, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కొండలు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె.జిలానిమాలిక్, ఆవాజ్ నాయకులు హుస్సేన్, గిరిజన ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీను నాయక్, ఎంసిపిఐ (యు) నాయకులు రెడ్ బాష, ఎంఐఎం నాయకులు షేక్ మస్తాన్‌వలి, దరియవలి, మౌలాలి, ముస్లిమ్ సంక్షేమ సంఘం నాయకులు బాజీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిమ్ మైనార్టీ నాయకులు పి.పూర్ణచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఎం బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫరీద్‌జి

యుసిసిని ముక్తకఠంతో వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - తెనాలి

యూనిఫాం సివిల్ కోడ్ ముస్లిములకే కాకుండా దేశంలోని ప్రజలందరికీ చేటు తెస్తుందని ఇమాన్ మజ్లీస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫరీద్ అన్నారు. పట్టణంలోని జామియా మసీద్ వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే కొన్ని నల్ల చట్టాలు తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని అన్నారు. అదే తరహాలో తెస్తున్న యునిఫాం సివిల్ కోడ్‌ను అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ షబ్బీర్, జామియా మసీద్ అధ్యక్షులు షేక్ సుభానిచ షేక్ సమద్, జనసేన మైనార్టీ నాయకులు ఫేక్ కాలేషా, కమిటీ సభ్యులు షేక్ సత్తార్, షేక్ షబ్బీర్, షేక్ అబ్దుల్ రహమాన్, సిహెచ్.గోపి, డి.రాఘవేంద్రరావు, డి,సాయి, తాజ్ బాషా, అమీన్, బాషాబాబు, సల్మాన్ సుల్తాన్, హకీమ్ అలీమ్ పాల్గొన్నారు.

క్రషర్ లారీలతో ప్రమాదాలు

- నిబంధనలు మీరితే చర్యలు
- యజమానులతో సిఐ సమావేశం



క్రషర్ యజమానులతో మాట్లాడుతున్న సిఐ కె.వాసు

ప్రజాశక్తి- మేడికొండూరు

అధిక లోడుతో ప్రయాణించే క్వారీలు, క్రషర్ల లారీలు వలన ప్రమాదాలు పొంచి ఉన్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని మేడికొండూరు సిఐ కె.వాసు అన్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పేరేచర్ల క్రషర్స్, క్వారీ ఓనర్ల సమావేశం జరిగింది. సిఐ కె.వాసు మాట్లాడుతూ క్వారీల నుండి బండారాళ్లతో క్రషర్లకు వెళ్లే లారీల సామర్థ్యానికి మించి అధిక లోడు వేయడం వలన, రోడ్డుపైన ప్రయాణించేటప్పుడు, లారీపై నుండి కొండ రాళ్లు కింద పడడంతో వెనక వచ్చే వాహనాలు పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. వాహనాల్లో అధిక లోడు ఉండడం, దుమ్ము లేవకుండా తడపకపోవడం వల్ల వెనక నుండి వచ్చే వాహనదారుల కళ్లల్లో డస్టు పడి పలురకాల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రమాదాల నియంత్రణకు లారీ, ట్రాక్టర్ లోడింగ్ సామర్థ్యానికి లోబడి లోడ్ చేయాలని ఆదేశించారు. క్రషర్ నుండి వచ్చే డస్టు లారీలు రోడ్లపై డస్ట్ పడకుండా పైన పట్టాలు కప్పాలని చెప్పారు. అధికలోడుతో లారీల్లో కంకర నింపడం వల్ల రోడ్లపై కంకరపడి ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, దీన్ని నివారించాలని చెప్పారు. మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పేరేచర్ల సెంటర్లోకి క్రషర్స్ లోడు లారీలు రాకూడదని స్పష్టం చేశారు. క్రషర్ లోడ్స్ లారీ డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని, తరచూ హారన్లు ఉపయోగించొద్దని సూచించారు. నిబంధనలు మీరితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గుంటూరు జిల్లా క్రషర్స్ అండ్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డీకే రవికుమార్, క్రషర్లు, క్వారీల ఓనర్లు పాల్గొన్నారు.



మౌలాలి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని డోజర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో కార్పెంటర్ మృతి చెందిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని నర్సరావుపేట చెక్ పోస్టు సెంటర్లో శుక్రవారం సాయంత్రం జరిగింది. పట్టణానికి చెందిన కార్పెంటర్ షేక్ మౌలాలి (బడేమియా) (50) ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి పట్టణంలోని వెంకటపతి నగర్ వెళుతుండగా వెనుక నుండి డోజర్ వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. హుటాహుటిన సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొద్దిసేపటికి మౌలాలి మృతిచెందాడు. మరోవ్యక్తి దూద్యే స్వల్పంగా గాయపడ్డారు. మృతునికి భార్య మహబీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ సిఐ యు.శోభన్‌బాబు కేసు నమోదు చేశారు.

భాష్యం ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసు

పార్టీ వ్యతిరేక కార్యకలాపాల అభియోగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే కారణంతో టిడిపి నాయకులు భాష్యం ప్రవీణ్‌కు టిడిపి క్రమశిక్షణ విభాగం శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ఆదేశాలను దిక్కరించి చిలకలూరిపేట నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై పార్టీ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ క్రమ శిక్షణ సంఘం తరుపున సీనియర్ నాయకుడు గుంటుపల్లి నాగేశ్వరరావు నోటీసు జారీ చేశారు.

భాష్యం, నారా ఫౌండేషన్ పేరుతో పార్టీ వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఖరిపై జిల్లా నాయకులు మండిపడుతున్నారు. ప్రవీణ్ చేసే కార్యక్రమాలకు పార్టీకి సంబంధం లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు ఇటీవలే ప్రకటించారు. ప్రవీణ్ వైఖరిపై ఇప్పటికే మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పార్టీ అధిష్టానం వద్ద తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఆయన పార్టీలో కొంత మంది నాయకులు సేవా కార్యక్రమాల పేరుతో ఎన్నికల్లో పోటీకి టిక్కెట్లు అడుతారా అని ప్రశ్నించారు. సేవా కార్యక్రమాలు చేసి నాలుగు రోజులు హడావుడి చేస్తారు? తరువాత పార్టీని ఎవరు నడుపుతారని ప్రవీణ్ వ్యవహార శైలిపై పుల్లారావు మండిపడ్డారు.

పలు నియోజకవర్గాలల్లో ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపార వేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాల పేరుతో తమ ఉద్యోగుల ద్వారా హడావుడి చేయడం పార్టీలో గందరగోళానికి దారితీస్తోంది. తాడికొండ నియోజకవర్గం పెదపరిమికి చెందిన భాష్యం ప్రవీణ్ తొలుత గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పాగా వేసేందుకు ప్రయత్నించగా ఈ స్థానం బిసిలకు ఇస్తారని ప్రచారం జరగడంతో ఆయన చిలకలూరిపేటపై దృష్టి సారించారు. ప్రవీణ్‌రాకను మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు వ్యతిరేకించి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అధిష్టానం ఆయన్ను చిలకలూరిపేట వెళ్లవద్దని చెప్పినా తన కార్యకలాపాలు కొనసాగించడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొనకుండా కేవలం తమ సంస్థల ద్వారా వస్త్రాలు, తోపుడుబండ్లు పంపిణీ చేస్తూ తామే ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పుకోవడంతో పలు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న టిడిపి ఇన్‌ఛార్జులకు మింగుడు పడటంలేదు. టిడిపి అనుకూల వాతావరణాన్ని ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపార వేత్తలు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి చెడగొడ్తున్నారని పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా పార్టీ అధిష్టానానికి భారీగా విరాళం ఇచ్చేసి కేవలం డబ్బు ప్రామాణికంగా నేరుగా ఎమ్మెల్యేలు, ఎంపిలు కావాలనే ఆకాంక్షతో సేవా కార్యక్రమాల పేరుతో నిర్వహిస్తున్న కార్యకలాపాలపై టిడిపిలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో భాష్యం ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం టిడిపిలో చర్చనీయాంశంగా మారింది.

ఎంఇఒ-1గా వేముల నాగయ్య

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల ఎంఇఒ-1గా వేముల నాగయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఇక్కడే మూడేళ్లపాటు పని చేసి బదిలీ అయ్యారు. మొన్నటి వరకూ మండలానికి ఇన్‌ఛార్జి ఎంఇఒగా అల్లి సురేష్ వ్యవహరించారు.

కుటుంబం హత్యకేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆస్తి కోసం ముగ్గురిని హత్య చేసిన కేసులో నిందితులైన షేక్ ఖాసిం, షేక్ జాకీర్, షేక్ సుఫియాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారయణ వివర్లా ప్రకారం.. షేక్ ఖాసిం అతని భార్య సుఫియా కొడుకు జాకీర్‌లు మృతురాలు షేక్ రహిమూన్‌కు ఉన్న రెండెకరాల పొలం, రేకుల ఇల్లు కాజేయాలనే ఉద్దేశంతో రహిమూన్ కుమారుడైన రెహ్మాన్‌ను డబ్బులు ఇస్తామని సత్తెనపల్లి పిలిపించారు. వారి మాట నమ్మి వచ్చిన రెహ్మాన్‌ను కెఎస్‌పి రెస్టారెంట్ వెనుక వైరుతో గొంతు బిగించి హత్య చేశారు. అనంతరం ధూళిపాళ్ల వెళ్లి రహిమూన్‌ను, ఆమె కుమార్తె మాలింబిలను చుట్టు పక్కల వారు చూస్తుండగా కత్తులతో దాడి చేసి హత్యచేశారు. మృతురాలు షేక్ రహిమూన్ మేనల్లుడు సత్తెనపల్లికి చెందిన మసీద్ అబ్దుల్ సర్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఎ1 ముద్దాయి అయిన షేక్ ఖాశిం 1996లో జరిగిన హత్య కేసులో ఎ1 ముద్దాయిగా వున్నాడని, రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందని డీఎస్పీ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ సిహెచ్ కోటేశ్వరరావు, పట్టణ సిఐ యు.శోభన్‌బాబు, రూరల్ ఎస్ఐ ఎ.బాలకృష్ణ, నకరికల్లు, రాజుపాలెం ఎస్ఐలు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - రెంటచింతల

అర్హత గల రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించే కిసాన్ డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి శుక్రవారం తెలిపారు. కనీసం ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడాలని, లబ్ధిదారులు తమ వంతు వాటా పది శాతం కాగా ప్రభుత్వం తమ వంతు వాటాగా 40 శాతం రాయితీ ఇస్తుందని, బ్యాంకు 50శాతం అప్పుగా ఇస్తుందని వివరించారు. పిచికారి చేసే డ్రోన్ల ధర రూ.10-15 లక్షలుంటుందని, ఇప్పటికే మండలంలో రెంటాల, పాలువాయి, తుమృకోట గ్రామాలకు ఇచ్చామని తెలిపారు.

కోర్టు నోటీసు

IN THE COURT OF THE I ADDL. DIST. JUDGE : GUNTUR

E.P. No.121/2019 in A.O.P. No. 371/2018

Between:

M/s.Shriram City Union Finance Ltd. Macherla Branch Rep. by its GPA Holder. ...DHR

And

Nakka Ravi Kumar & Another. ...JDR's

To,

JDR-2:Kandrathi Jithendra Kumar, S/o. Krishna Rao, R/o. Door No.4-6-40/2, Thyagaraja Road, 5th Lane, Koritepadu, Guntur.

పైనెంబరు ఇ.పి.లో 2వ జె.డి.ఆర్. అయిన మీకు నోటీసు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు.కావున పైనఉదహరించిన 2వ జె.డి.ఆర్. **ది.13-07-2023న ఉ॥గం॥10-30ని॥**లకు పై కోర్టువారి ఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.

D. NARAYANA MURTHY
Advocate for DHR, Guntur



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 33,294
మిర్చి ఎగుమతి	: 36,041
మిర్చి నిల్వ	: 11,772

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 24,000
నెం.5	12,000 - 22,500
273	19,000 - 21,200
341	10,500 - 22,500
4884	11,000 - 11,000
సూపర్ 10	18,500 - 22,600
నాన్ ఏసి	
తేజ	9,000 - 24,500
బడిగి	10,200 - 26,000
దేవనూరు డీలక్స్	11,500 - 20,500
తాలుకాయలు	5,500 - 14,000
ఏసి	
334	11,500 - 22,000
341	13,500 - 24,000
4884	18,500 - 22,000
తేజ	11,000 - 24,500
బడిగి	11,000 - 25,000
దేవనూరు డీలక్స్	19,000 - 20,000
తాలుకాయలు	6,000 -13,500

ఎనిమిది మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని వరగాని పేకాట ఆడుతున్న ముగ్గుర్ని పోలీసులు శుక్రవార అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.2,265 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులోని ఆంధ్రాబ్యాంక్ సమీపంలోని పాఠశాల పక్కన గోడ వద్ద పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకుని రూ.4,050 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పాత కక్షల నేపథ్యంలో వృద్ధురాలిపై దాడి చేసిన ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని 113 తాళ్లూరుకు చెందిన దేగల కామేశ్వరమ్మ మనవడు 13 ఏళ్ల చరణ్ గతనెల 29న తోటి పిల్లలతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామానికే చెందిన అంచుల అనిల్ కుమార్ కుమారుడు సాయితో గొడవైంది. ఇరు పక్షాల పెద్దలు మాట్లాడి సర్ది చెప్పారు. దీన్ని మనసులో పెట్టుకున్న అనిల్ కుమార్ గత బుధవారం సాయంత్రం 4 గంటలకు కామేశ్వరమ్మ తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా ఇనపరాడ్డుతూ దాడి చేశాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయిన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం గుంటూరులోని ఒ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఆమె భర్త నరసింహారావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు రైల్వే గేటు సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని శుక్రవారం మేడికొండూరు ఎస్ఐ మధుపవన్ పట్టుకున్నారు. కొప్పుల ఆరోగ్య రాజును అదుపులోకి తీసుకుని, 250 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచితమంటూనే కనెక్షన్ల తొలగింపు

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 3వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యుత్ భారాలను నిరసిస్తూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 5వ తేదీ నుండి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 3వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షల్లో జై భీమ్ పార్టీ, మాల మహానాడు ఆధ్వర్యంలో నాయకులు జి.జాన్‌పాల్, జయరావ్ తదితరులు కూర్చున్నారు. దీక్షాపరులకు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జై భీమ్ భారత్ పార్టీ నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు జి.జాన్‌పాల్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దళితులకు 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ అని చెప్పి ప్రస్తుతం బిల్లులు పెండింగ్ ఉన్నాయంటూ గ్రామాల్లోని దళిత కాలనీల్లో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బిజెపి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలకటం, కేంద్ర ప్రభుత్వ విధానాలను తూచా తప్పకుండా రాష్ట్రంలో అమలు చేసి ప్రజలపై భారాలు మోపటం దుర్మార్గమని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం ఉచిత విద్యుత్ మంగళం పాడేందుకేనని, రైతులు మోటార్లకు మీటర్లు ప్రక్రియను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ జయరావ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు వలన విద్యుత్ ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ద్వారా కార్పొరేట్ కంపెనీలకు రూ.కోట్ల లాభాలు కట్టబెట్టేం దుకు, ఆ భారాన్ని ప్రజలపై మోపేందుకు బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన వైసిపి మాత్రం బిజెపి విధానాలను అమలు చేసేందుకు ఉత్సాహం చూపడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. దీక్షలకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు పట్టణ అధ్యక్షులు సిలార్ మసూద్, మాల మహానాడు నాయకులు జి.బాల, ఎం.సాం బశివ, జి.మోహన్, కె.శ్యామ్‌బాబు, ఎం.సుబ్బారావు, జె.సుగుణ, సి.హెచ్ బాబు, డి.ప్రదీప్, కె.దాసు పాల్గొన్నారు.



దీక్షల్లో జై భీమ్ భారత్ పార్టీ, మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి జనని

మిర్చి నర్సరీ యజమానులు లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విత్తన చట్టం ప్రకారం నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖ అధికారి సిహెచ్ జనని అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో నర్సరీ యజమానులతో శుక్రవారం సమావేశమయ్యారు. షేడ్ నెట్ల్ రెండు పక్కల డోర్లు ఏర్పాటు చేయాలని, రికార్డులు నిర్వహించాలని సూచించారు. మిర్చి నారు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. బిల్లుపై మిర్చి విత్తన రకం, లాట్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.



వైద్యులను సత్కరిస్తున్న రామకృష్ణ తదితరులు

నూతన వైద్యులకు సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక ప్రభుత్వాస్పత్రికి బదిలీపై నూతనంగా వచ్చిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆరుణకుమారి, దంత వైద్య నిపుణులు డాక్టర్ జాఫ్రీని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ శుక్రవారం సత్కరించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఉన్నతమైన సేవలందించి ఆస్పత్రికి మరింత పేరు తేవాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యాన్ని సేవాభావంతో అందించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న రామకృష్ణ తదితరులు

భాష్యం ప్రవీణ్ ర్యాలీ, సమావేశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో నారా ఫౌండేషన్ సభ్యులు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల కలసి శుక్రవారం బోయపాలెం నుండి చిలకలూరిపేట వరకూ ర్యాలీ నిర్వహించారు. బోయపాలెం సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి ప్రవీణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిలకలూరిపేటలోని ఎన్ఆర్‌టి సెంటర్లోని విగ్రహానికి పూలమాలలేశారు. అనంతరం నారా పౌండేషన్ కార్యాలయంలో ఏడుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అనంతరం భాష్యం ప్రవీణ్ మిత్ర మండలి సమావేశం నిర్వహించారు.

రీసర్వేపై జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. రీసర్వే పనులను పరిశీలించి సమీక్షించారు. పనులను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు చెందిన పొలాలను సర్వే చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.అంకారావు, డిప్యూటీ తహశీల్దార్ బాలవెంకటేష్, ఆర్ఐ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న జెసి

ఆ ఊళ్లకు ఇప్పటి వరకు బస్సే లేదు

ప్రజాశక్తి - దాచేపల్లి

తరతరాలుగా సొంత, ప్రైవేటు రవాణా మీదే ఆధారపడ్డ తమకు ఇప్పటికైనా ప్రజారవాణాను అందుబాటులోకి తేవాలని మండలంలోని మాదినపాడు, కొత్తూరు, సారంగపల్లి, అగ్రహారం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ గ్రామాలకు రహదారి సదుపాయం ఉన్నా ఇప్పటి వరకు ఆర్‌టిసి బస్సులు వేయలేదని చెబుతున్నారు. దీనిపై ఎంపిడిఒ కార్యాలయంలో విన్నవించేందుకు శుక్రవారం వలువురు రాగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. దాచేపల్లి నుండి కొత్తూరుకు సుమారు 12 కిలో మీటర్లు ఉంటుంది. ఈ మార్గంలోనే మిగతా మూడు గ్రామాలూ ఉన్నాయి. ఈ గ్రామాల నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో విద్యార్థులు దాచేపల్లిలోని మోడల్‌స్కూల్‌కు వస్తుంటారు. వీరితోపాటు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తేవారు, వివిధ అవసరాల కోసం మండల కేంద్రమైన దాచేపల్లికి వచ్చేవారూ ఉంటారు. వీరంతా ఆటోలు, సొంత వాహనాలపై తమ ప్రయాణ అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే నిర్దిష్ట సమయాలకు వాహనాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని, దీంతోపాటు భద్రత, ఆర్థిక అంశాల దృష్ట్యా ఒక ఆర్‌టిసి బస్సును వేసి తిప్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం 36 గంటల ధర్నా

అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాశక్తి - వినుకొండ

అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే 36 గంటల ధర్నాలో అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కోశాధికారి ఎఎల్ ప్రసన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీలపై రాజకీయ వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులకు బడ్జెట్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అన్నారు. సర్వీస్‌లో ఉండి మృతి చెందిన వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని కోరారు. పిల్లలకు అమ్మబడి వర్తింపజేయాలని, యూనిఫాం ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. 2017 నుండి పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులను వెంటనే ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వర్లు నాసర్ బి, రంజాన్ బి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గణపవరంలోని ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద పోస్టర్లను ఆవిష్కరించగా సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. తెలంగాణలో కంటే ఎక్కువ జీతం ఇస్తామని సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, రాజకీయ ప్రాబల్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన అనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు పరిమితి తొలగించాలని, పెండింగ్లో ఉన్న గ్రేడ్ సూపర్వైజర్ పోస్టుల్లో మిగిలిన 104 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ డివిజన్ అధ్యక్షులు జి.సావిత్రి, అంగన్వాడీలు పాల్గొన్నారు.





పిహెచ్‌సికి రూ.50 లక్షలతో అదనపు బ్లాక్

ప్రజాశక్తి - కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని పీహెచ్‌సీకి అదనపు బ్లాక్ యూనిట్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. రూ.50 లక్షలతో నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని, కొలతలు వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్ అండ్ బి అధికారి గోపీకృష్ణ తెలిపారు. రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. పరిశీలనలో జెడ్‌పిటిసి షేక్ షఫీ, విఆర్వో కృష్ణప్రసాద్, వైద్యాధికారి బత్తుల దుర్గారావు ఉన్నారు.



టమాటా @ 160

రైతుబజార్లో నామమాత్రంగానే విక్రయాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో టమాట ధర కేజీ రూ.160 పైన పలుకుతుంది. పచ్చిమిర్చి కేజీ రూ.150ధర పలుకుతుంది. ఈ రెండు ప్రతికూరలోను వేసి వంట చేస్తూ ఉంటారు. ఈ రేట్లు పెరగడం వలన పేద ప్రజలకు టమాట, పచ్చిమిర్చి కొనుగోలు చేసే స్థాయి లేకుండా పోయింది. గతంలో మిగతా కూరగాయలు ధరలు పెరిగితే కనీసం టమాట, పచ్చి మిర్చితో నన్న పచ్చడి చేసుకొని తినేవాళు.. ఇప్పుడు ఆ రెండు రెట్లతో పాటు మిగిలిన కూరగాయలు కూడా కేజీ రూ.60 పైనే పలుకుతుంది. టమాటాకు దిగుబడులు లేకపోవడం ధర పెరిగింది అంటే అర్థముంది. మంగళగిరి పరిసర ప్రాంతాల బెండ, బీరకాయ, వంకాయ, దొండకాయ, బెండకాయ, దోసకాయ పండుతాయి. వీటి ధరలను కూడా మార్కెట్ శాఖ నియంత్రించలేని పరిస్థితిలో ఉంది. రైతు బజార్లో రోజుకు టమాటాలు 1200 కేజీలు అవసరం ఉంది. సబ్సిడీ టమాటాలు 800 కేజీలు మాత్రమే పంపిస్తున్నారు. రెండు గంటలపాటు విక్రయాలు చేస్తున్నారు. తర్వాత వచ్చిన వారు తిరిగి పోతున్నారు. సరిపడ టమాటాలు పంపించాలని సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే కలగజేసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి మాలతి

22న ప్రత్యేక లోక్అదాలత్

ప్రజాశక్తి - తెనాలి

ఈ నెల 22న నిర్వహించే ప్రత్యేక లోకదాలత్‌లో మోటారు ప్రమాదాలూ, భూమి పరిహార కేసులు పరిష్కరించుకోవాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి మాలతి కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్, బీమా న్యాయవాదులుతో ఆమె మాట్లాడారు. ఈ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు పూర్తి అవగాహన కల్పించా లని కోరారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు బార్ అసోసియేషన్ బృందం పాల్గొన్నారు.



పెదనందిపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు



గంటూరు సమావేశంలో మాట్లాడుతున్న బేబిరాణి

అంగన్వాడీల 36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి జూలై 10, 11 తేదీల్లో జరిగే డిమాండ్స్‌డే ను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రమా సుష్మ అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామన్న మాట ప్రకారం రాష్ట్రంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లు వయసు 50 సంవత్సరాలకు పెంచాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరఫరా చేయాలని కోరారు. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జరిగే 36 గంటల ధర్నాలో అంగన్వాడీలు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ, గౌరవాధ్యక్షులు వై. నేతాజీ, యూనియన్ నాయకులు ఏ.వి.ఎన్ కుమారి, ధనలక్ష్మి, విజయ్ కుమారి, శ్యామల, సుకన్య, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు : 36గంటల అంగన్వాడీ ధర్నాను జయప్రదం చేయాలని పెదనందిపాడులో యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ధనలక్ష్మి, పి రమణ, షేక్ సైదాబీ, మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో చేనేతలపై దాడి చేసిన

అవినాష్ గుప్తాను కఠినంగా శిక్షించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో తీవ్రంగా ఖండించిన ఐక్యకార్యాచరణ కమిటీ

రేపు నిరసనలకు పిలుపు - మంగళగిరిలో నిరసన ప్రదర్శన - తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై అతి కిరాతకంగా దాడి చేసి దుర్భాషలాడిన అవినాష్ గుప్తాని వెంటనే అరెస్ట్ చేయాలని చేనేత ఐక్య కార్యచరణ కమిటీ డిమాండ్ చేశారు. మంగళగిరి మార్కండేయ కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ చేనేతల దగ్గర వస్త్రాలు కొనుక్కొని వ్యాపారం చేసుకుంటూ తాను తీసుకున్న వస్త్రాలకు డబ్బులు అడగడానికి వెళ్లిన ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారస్తులను అతి కిరాతకంగా దుర్భాషలాడుతూ వీడియోను కూడా సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అధికార మదంతో విర్రవీగుతున్న అవినాష్ గుప్తాను వెంటనే అరెస్టు చేయకపోతే చేనేత ఐక్య కార్యం చరణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు హెచ్చరించారు. చేనేతలపై జరిగే దాడులను సుమోటోగా స్వీకరించాలని, కేసు నమోదు చేయాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా సోమవారం చేనేత వస్త్రాలయాలు, మాస్టర్ వివర్స్ చేనేత ఉపవృత్తులు, చేనేత షాపులను బందు చేసి, భారీ ప్రదర్శన నిర్వహించి ఎమ్మార్వోలకి మెమోరాండం ఇవ్వాలని నిర్ణయించారు. అవినాష్ గుప్తా అనే దుర్మార్గుడు నడుపుతున్న ఆలయ సిల్క్ షాపును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. చేనేతలపై ఇలాంటి దాడులు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా చేనేతలందరూ కలిసి తగిన గుణపాఠం చెప్తారని తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో న్యాయవాది వైకె, నాయకులు పి నాగేశ్వరరావు,



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

జొన్నాదుల మణి, రామనాథం పూర్ణచంద్రరావు, డోకుపర్తి రామారావు, కూరపాటి కోటేశ్వరరావు, బత్తూరి మోహనరావు, కొలుసు రవి, స్వరం పుల్లారావు, రామచంద్రరావు, పుచ్చల నాగేశ్వరరావు, రామనాథం పరమేశ్వరరావు, భీమిశెట్టి బాలేశ్వరరావు, గజవల్లి వెంకట కృష్ణారావు, దొడ్డి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

చేనేత విభాగం నాయకులు నిరసన

చేనేత విభాగం నాయకులు శుక్రవారం సాయంత్రం మంగళగిరిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్‌కు వినతిపత్రం, పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు ధనుంజయ రావు, కే అంకమ్మరావు, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, వాకా మంగారావు, షేక్ రియాజ్, టీ బాపనయ్య పాల్గొన్నారు.

అవినాష్ గుప్తాను అరెస్ట్ చేశారు : గంజి

ధర్మవరం పద్మశాలి చేనేత వస్త్ర వ్యాపారులపై దాడి చేసిన అవినాష్ గుప్తాను పోలీసుల అరెస్ట్ చేశారని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. చేనేతలపై ఎవరు దాడి చేసిన ప్రభుత్వం స్పందిస్తుందని తెలిపారు.

10వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

వినూత్న నిరసన - రైతు, ప్రజాసంఘాల నాయకుల మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని జూన్ 28వ తేదీ నుంచి చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారంతో పదవ రోజుకు చేరుకున్నాయి. నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో రైతులు, మహిళలు, వివిధ సంఘాలు పాల్గొని సంఘీభావం తెలిపాయి. శుక్రవారం దీక్షల సందర్భంగా వినూత్నంగా నిరసన తెలిపారు. దీక్షా శిబిరం వద్ద కట్టెల పొయ్యి వెలిగించి, వంట చేశారు. మేడావారిపాలెం సర్పంచ్ వీరగంధం చెంచులక్ష్మి ఆధ్వరంలో జాలాది సరోజిని, నాగరాజు పద్మావతి, అడ్డగడ్డ అరుణ, ఇ.శివలీల, టి.శారద, ఇ.నిర్మల తదితర మహిళలు పాల్గొన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వై.కేశవరావు, జొన్నా శివశంకర్, పిడిఎస్‌యు నాయకులు గనిరాజు, రెడ్‌స్టార్ పార్టీ నాయకులు మన్నవ హరిప్రసాద్, రైతురక్షణ వేదిక నాయకులు తేళ్ల కృష్ణమూర్తి, రావిపాడు వైసిపి నాయకులు హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి తక్షణమే భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కేశవరావు డిమాండ్ చేశారు. గత 8 దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షను నెరవేర్చటానికి, కనీసం అవసరమైన తాగు, సాగునీటిని అందించటానికి ప్రభుత్వాలకు చేతులు రావట్లేదన్నారు. గుంటూరు ఛానల్ విస్తరించే వరకూ ఉద్యమం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అలాగే నల్లమడ రైతు నాయకులు పెద్దన్న, దొర్పలపూడి హరిబాబు , కొల్లా ప్రసాద్ , ముత్తవరపు వెంకయ్య చౌదరి, జేష్ట వీరయ్యచౌదరి, లావు అంకమ్మ చౌదరి, పోపూరి నాగేశ్వరరావు ప్రసంగించారు.



దీక్షా శిబిరం వద్ద వంట చేస్తున్న మహిళలు, రైతులు

ఎస్ఎఫ్ఐ తెనాలి నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ఉదయ్ ఈశ్వర్, కె.సుభాష్

ప్రజాశక్తి - తెనాలి



ఎస్ఎఫ్ఐ తెనాలి నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం బాలాజి, ఎం కిరణ్ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. అనంతరం 14 మందితో తెనాలి కమిటీని వారు ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. ఉదయ్ ఈశ్వర్, కూచిపూడి సుభాష్, ఉపాధ్యక్షులుగా అద్దంకి సాత్విక్, పి. అనుదీప్, కె.రవీంద్ర, సహాయ కార్యదర్శులుగా నంబూరి వినయ్, సిహెచ్ నరేంద్ర, కె. నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై తిరుగులేని సమరశీల పోరాటాలను చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

1300వ రోజు 'నాలుగేళ్ల నరకంలో నవ నగరం'

నేడు కనదుర్గ దర్శనానికి రాజధాని రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధాని ప్రాంతంలోని మందడం రైతు దీక్షా శిబిరం వద్ద ఆదివారం 'నాలుగేళ్ల నరకంలో నవ నగరం 'పేరుతో కార్యక్రమం జరగనుంది. అమరావతి మహోద్యమం ఆదివారం నాటికి 1300 రోజులకు చేరుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి, పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమంలో అమరావతి ఉద్యమానికి మొదటి నుంచి మద్దతు తెలుపుతున్న వివిధ రాజకీయ పార్టీల, దళిత,రైతు,ప్రజా సంఘాల నాయకులు హాజరుకావాలని రైతు జెఏసి, రైతు పరిరక్షణ సమితి నాయకులు ఒక ప్రకటనలో కోరారు. రాజధాని రైతులు,రైతు కూలీలు, మహిళలు శనివారం విజయవాడ లోని కనక దుర్గమ్మ దర్శనానికి వెళ్లనున్నారు. ఆదివారం 1300వ రోజుకు చేరుకుంటున్నందున ఒక్క రోజు ముందు శనివారం ఉదయం 6.30 గంటలకు రాజధాని ప్రాంతం వెంకటపాలెం లోని వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర నుంచి కనక దుర్గమ్మ గుడికి అక్కడ నుంచి మంగళగిరి పానకాల నరసింహస్వామి దర్శనానికి వెళతారని, అమరావతి రైతు ఐక్యకార్యాచరణ, పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు.

నేడు మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

మీడియా సమావేశంలో మట్టుపల్లి మోహన్

ప్రజాశక్తి-గుంటూరు



' ఒక చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం ప్రధాన మంత్రి సంతకం కంటే ఎంతో విలువైనది' అన్న ప్రధాని మాటలపై 9, 10వ తరగతి విద్యార్థులకు నేడు ఉదయం 9 గంటలకు బ్రాడీపేట 4వలైను, వజ్రం హోటల్ వెనుక ఉన్న మాస్టర్‌మైండ్స్, బాలాజీ క్యాంపస్‌లో వక్తృత్వం పోటీలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాస్టర్‌మైండ్స్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో మాట్లాడవచ్చని, ప్రతి విద్యార్థికి 3 నుండి 5 నిముషాల సమయం ఉంటుందన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, విజేతలకు నగదు బహుతులు ఉంటాయన్నారు. రెండు ఫేజులుగా ఈ పోటీలు జరుగుతాయని, నగర పరిధిలో జరిగే మొదటి ఫేజ్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.1500లు, రూ.1000లు, రూ.500లు నగదు బహుమతి ఇస్తామన్నారు. అలాగే ఆయా విజేతలతో ఎపి, తెలంగాణ స్థాయిలో జూమ్ ద్వారా గ్రాండ్ ఫైనాల్ జరుగుతుందన్నారు. ఫైనల్స్‌లో మొదటి ముగ్గురు విజేతలకు రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు బహుమతిగా అందజేస్తామన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు 8978180828, 7416380338 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎన్నారై దంపతుల విరాళం

సమావేశ మందిరానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- ముప్పాళ్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాల అభివద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల కేంద్రం ముప్పాళ్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎన్నారై కృపారావు దంపతులు ఆర్థిక సహకారంతో రూ.15 లక్షలతో నిర్మించనున్న సమావేశ మంది రానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తో కలిసి మంత్రి అంబటి రాంబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం తోపాటు విద్య,వైద్య రంగాల అభి వృద్ధికి దాతలు ముందుకు రావడంపై అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమావేశ మందిరానికి కృపారావు దంపతులు నిధులను విరాళంగా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

గతంలో ఇదే గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గ ప్రజలకు శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో దాతలు ముందుకు వచ్చి స్మశాన స్థలం కొనుగోలు చేసి అందించిన వారిలో ఎన్నారై దంపతులు కూడా ఉన్నారని మంత్రి గుర్తు చేశారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సామాజిక సేవా దక్పథంతో పనిచేయడం ద్వారా ముప్పాళ్ళ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ఎన్ కాస్ గుర్తింపు లభించిందని, కేంద్ర ప్రభుత్వం ఇందుకు గాను రూ.3 లక్షల నిధులను విడుదల చేయనుండటం మంచి పనితీరుకు నిదర్శనమ అన్నారు. ఎన్ కాస్ ధ్రువీకరణ పత్రాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ ల చేతుల మీదుగా ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ రమాదేవికి అందజేశారు.భవిష్యత్తులో ఈ ఆసుపత్రికి 10 పడకల బెడ్లను ఏర్పాటు చేసేలా అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ విభాగం ప్రభుత్వ సలహాదారు ఫాదర్ బాలస్వామి, ఎంపీపీ ఎం.పద్మ, పల్నాడు జిల్లా డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ జి చంద్రశేఖర్, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, జయ కృష్ణ, పీటర్ డామియెన్ , సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్ తదితరులు



ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - దాచేపల్లి

నారాయణపురం రైల్వేస్టేషన్ రోడ్డులో అక్రమ కట్ట డాలను అధికారులు శుక్రవారం తొలగించారు నారాయణ పురం ఆర్అండ్‌బి బంగ్లా నుండి నడి కుడి రైల్వేస్టేషన్ వరకు డబుల్ రోడ్డు మంజూరైన నేపథ్యంలో అధికారులు ఆక్ర మణలు తొలగించారు. అయితే దశాబ్దల తరబడి నివాసం ఉంటున్న గృహాలు తొలగించడంతో తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



అంతర పంటలు లాభదాయకం

పల్నాడు డిపిఎం అమల కుమారి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రైతులు ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబించడం ద్వారా రాబోవు తరాలకు ఆరోగ్యం,భవిష్యత్తుతో పాటు విలువైన మంచి భూమిని అందించ వచ్చని జిల్లా డిపిఎమ్ అమలకుమారి అన్నారు. మండలంలోని నార్నెపాడు లో శు క్రవారం రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నార్నెపాడులో వేమూరు ప్రసాద్ పొలం వద్ద ఐదు ఎకరాల్లో కాంపక్ట్ బ్లాక్ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలంలో పిఎండిస్ నవధాన్యాలు వేశారు. అనంతరం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ కార్య కర్త ఉమామహేశ్వరి పొలం వద్ద పిఎండిఎస్ నవధాన్యాల పంట పరి శీలించారు. ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డిపిఎం ప్రేమ్ రాజు, నాచురల్ ఫామింగ్ అసోసియేట్ నందకుమార్, ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని పలు పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థినిలకు రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల శాఖ ఆధ్వర్యంలో 20 సైకిళ్లు పంపిణీ చేశారు రోటరీ క్లబ్ కార్య దర్శి పటాన్ నాగూర్ వల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలల్లో చదువుతూ దూర ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న పేద బాలికలను గుర్తించి వారికి సైకిల్ పంపిణీ చేసినట్లు చెప్పారు. 'ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు' అన్న నినాదంతో రోటరీ క్లబ్ బాలిక విద్యకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు సత్యనారాయణ సీనియర్ నాయకులు ఇక్కుర్తి శంకర్, డాక్టర్ రామకోటయ్య, మౌనిక పాల్గొన్నారు.

వినియోగదారులకు రాయితీపై టమాటాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులను ఆదుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం వ్యవ సాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై టమోటాలను అందిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజార్‌లో శుక్రవారం రాయితీపై టమోటాలు పంపిణీ చేశారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై వినియోగదారులకు టమోటాలు పం పిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ సీజన్‌లో వర్షాల కారణంగా పంట దెబ్బతిని టమోటాల దిగుబడి తగ్గిపోతోందని, తద్వారా ధరలు పెరుగుతున్నాయని, దీని బారి నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం నేరుగా రాయితీపై వీటిని అందిస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పి. బాబురావు, యార్డు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు .



టమోటాలు పంపిణి చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



టమాటా విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బహిరంగ మార్కెట్ లో టమాట ధర రూ 150 ఉన్న నేపథ్యంలో సామాన్య మధ్యతరగతి ప్రజల అవసరాల దృష్ట్యా రాయితీపై రూ.50 కు టమోటాలు పంపిణీ చేస్తు న్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం టమాటా విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన మాట ప్రకారం ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1500 కేజీల టమోటాను పట్టణ ప్రజలకు రూ 50 లకు పంపిణీ చేశామన్నారు. టమోటా ధర తగ్గేవరకు విక్రయ కేంద్రాన్ని నడుపుతామని చెప్పారు. ఈ అవ కాశాన్ని పేద,మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎ హనీఫ్ పాల్గొన్నారు.

13న ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో టిడిపి గెలుపునకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీలు కషి చేయాలని రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులకు డాక్టర్ చదలవాడ సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ముస్లిం మైనారిటీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వైసిపి పాలనలో మైనా ర్టీల పై దాడులు పెరిగాయని ముస్లిం మైనార్టీల సంక్షేమ పథకాలను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 13 న టిడిపి కార్యాలయంలో జరిగే పల్నాడు జిల్లా ముస్లిం మైనారిటీ ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక మైనారిటీలకి చెందిన అన్ని పథకాలకు తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. ముస్లిం మైనారిటీల పై దాడులు పెరిగి పోయాయని, అక్రమ కేసులు, వక్ఫ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతం చేస్తూ, ముస్లిం మైనారిటీలను మనోభావా లను కించపరుస్తున్నారని విమర్శించారు. జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, కృష్ణా జిల్లా మచిలీపట్నం ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాజా, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి మన్నాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ముస్లిం ముఖ్య నాయకులను సన్మానిస్తున్న అరవిందబాబు

ఓటర్ల నమోదుపై సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మూడు మండలాల ఓటర్ల నమోదు తదితర అంశాలపై నియోజకవర్గ స్థాయిలో సమావేశాన్ని పులిచింతల ప్రాజెక్టు పిఎ టు స్పెషల్ కలెక్టర్ జి. వసంతబాబు ఆధ్వర్యంలో నిర్వ హించామని మండల తహశీల్దార్ జి.సుజాత అన్నారు. శు క్రవారం నాడు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. కలెక్టర్ జి.వసంతబాబు ప్రత్యేకంగా జరుగుతున్న ప్రత్యేక ఒటర్ల సవరణ కార్యక్రమం-2023లో భాగంగా యడ్లపాడు, నాదెండ్ల,చిలకలూరిపేట, చిలకలూరి పేట రూరల్ మండలాల్లో ఓటర్ల చేర్పులు, మార్పులు తొల గింపులకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. నాదెండ్ల, యడ్లపాడు తహశీల్దారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఈపూరు, ముప్పాళ్ళ, కొచ్చర్ల, ఊడిజర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సబ్ స్టేషన్, 11 కెవి,33 కెవి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్ ఛార్జి ఎఇ గాంధీబాబు శుక్రవారం తెలిపారు. ఈ విషయమై విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



నేడు జల దీక్ష ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో రూ.218 కోట్లతో జల దీక్ష కార్యక్రమం శనివారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చెప్పారు. శుక్ర వారం స్థానిక వైసిపి కార్యా లయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో వైయస్సార్ జయంతి సందర్భంగా జల దీక్ష కార్య క్రమం ప్రారంభిస్తున్నామని, రానున్న 24 నెలల వ్యవధిలో ఈ కార్యక్రమం పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కృష్ణ నీటిని అందిస్తామని అన్నారు. మాచవరం మండలం తురకపాలెంలో శనివారం 200 ఇళ్లకు తాగునీటిని అందించబోతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. నియోజకవర్గంలో ఒక్క గ్రామానికి కానీ వార్డుకు కానీ తాగునీరు ఇవ్వలేకపోయారని యరపతినేనిపై విమర్శలు చేశారు. మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు పట్టణ మండల అధ్యక్షులు సిహెచ్ రామారావు, సిహెచ్ పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎండి గపూర్, మాజీ జెడ్పిటిసి వీరభద్ర రామిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్యే కంద్రాన్ని శుక్రవారం పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలను పరిశీలించి దోమల నియంత్రణ చర్యలు గురించి వివరించారు. ప్రతి శుక్రవారం జరుగనున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహణను గురించి అడిగి తెలుసు కుని పలు సూచనలు చేశారు. అదే విధంగా హాస్పిటల్ లో రికార్డులను, ల్యాబ్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని , వసతి గహాన్ని సందర్శించి దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లా డుతూ వర్షాకాలంలో నీటి నిల్వలు అధికంగా ఉండటం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని అన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఇఒలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని బాలాజీరావుపేట మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల, దివ్యాంగబాలల పాఠశాల భవిత కేంద్రాన్ని ఎంఇఒ-1 డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుక ద్వారా అందించిన బ్యాగ్, యూనిఫామ్, షూస్, సాక్స్, బెల్ట్ తో కూడిన కిట్ ను విద్యార్థులందరికీ అందిందా లేదా తెలుసుకున్నారు. యూనిఫామ్ లో అటెండ్ కాని విద్యార్థుల తల్లిదండ్రులకు త్వరగా వారి పిల్లలతో యూనిఫామ్ ధరింపచేసి స్కూల్ కి పంపేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై తరగతి ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని అన్నారు. జెవికె కిట్టు అందని విద్యార్థులు వివరాలపై ఆరా తీశారు. స్థానిక మారీస్‌పేట లోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ- 2 వి. జయంతి బాబు సందర్శించారు. విద్యార్థుల హాజరు, జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుపై ఆరా తీశారు. ఇంకా ఇంటి నుండి భోజనంతెస్తున్న విద్యార్థుల తల్లులతో ఆయన మాట్లాడారు. పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలలోనే జగనన్న గోరుముద్ద తీసుకోవాలని సూచించారు. గత రెండేళ్లుగా కొనసాగుతున్న డ్రాపౌట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు అభివృద్ధి పనులు జులై నెలాఖరుకు పూర్తి చేయాలన్న అధికారుల ఆదేశాల దృష్ట్యా మున్సిపల్ ఆఫీస్‌లో ఎఈ నాగమల్లేశ్వరరావుతో కలసి, ఎఇ లకు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీరితోపాటుగా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ అరుణ్ కుమార్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ శ్యాంబాబు శ్రీదేవి ఉన్నారు.



ఎన్సిఆర్ఎం స్కూల్లో విద్యార్థులతో ఎంఇఒజయంతిబాబు



విద్యతోనే పేదరికం దూరం

ప్రజాశక్తి - మంగళగిరి

విద్య తోనే పేదరికం దూరం అవుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణం లోని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమం జరిగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 67 వేల కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎంఇఒ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల లో శుక్రవారం కార్మికులు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల సిఐటియు కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ కార్మికులకు కంపెనీ యాజమాన్యం కనీస వేతనం ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కార్మికులందరూ సమైక్యంగా ఉండి కార్మిక చట్టాలను అమలు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పనికి తగిన వేతనం పొందాలని అన్నారు. ముఖ్యంగా కార్మిక చట్టాలలో మహిళా కార్మికులకు అనేక రకాల ప్రయోజనకరమైన సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్ రెడ్డి, జిఎస్ కె.బాబు, పి.అబ్దుల్లా, ఎం గోపికృష్ణ, పి.శౌరిరాజు , ఎం.వెంకయ్య, సీతాపతి, ఆర్ రాంబాబు, అచ్చారావు, పి.సుధాకర్‌రెడ్డి, షేక్ సుభాని, పి.జాన్ పీరా, పి.మల్లారెడ్డి, కె.శ్రీ వాసరావు, పాల్గొన్నారు.

17వ రోజుకు కార్మికుల నిరసన

మండలంలోని పేరేచర్ల నికో ఆగ్రో ఆయిల్ కంపెనీ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన శుక్రవారం 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ కంపెనీ కార్మికులు కనీస సౌకర్యాలు కల్పించామని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ కంపెనీ యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మికులతో చర్చలు జరిపి వారి ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చాలని, ఇదే మొండి వైఖరితో యాజమాన్యం ఉంటే సమ్మె తప్పదని హెచ్చరించారు.

కార్యక్రమంలో కంపెనీ కార్మిక యూని యన్ కమిటీ నాయకుడు కె.వీర్రాజు, షేక్ మీరా సాహెబ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.భూపతిరావు, బి.ఉమా మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆర్.రాంబాబు, డి విజయ్ బాబు, ఎ.సంగీత పాల్గొన్నారు.



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మండల సిఐటియు కార్యదర్శి ఎస్ఎం బాషా



తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరులో 4, 17 వార్డుల పరిధిలో నెలకొని ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకొచ్చినా పరిష్కారానికి నోచుకోవడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక మహిళలు కృష్ణుని గుడి వద్ద గల 4, 5 సచివాలయాల సెక్రటరీలకు అర్జీ అందజేశారు. గత ఆరె నెలలుగా ఈ ప్రాంతంలో మంచినీటి ఎద్దడి నెలకొని ఉంది. వచ్చే నీరు అరకొరగా వస్తున్నారు. వాటిలో మురుగునీరే అధికంగా వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి.గిరిజ, స్థానిక మహిళలు బి.సీతాదేవి, కృష్ణవేణి, కె.కవిత, బి.చినలక్ష్మి, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి డివి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

15వ వార్డులో పిచ్చి చెట్లు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి



15వ వార్డు పరిధిలో మురుగు కాలువపై పెరిగిన పిచ్చి చెట్లను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పెరిగిన పిచ్చిచెట్లు విష కీటకాలతో భయం పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తా కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆ మేరకు శుక్రవారం శానిటేషన్ సిబ్బందిని ఆప్రాంతానికి పంపించి శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు ఆ ఏరియా శానిటేషన్ విభాగం మేస్త్రికి అభినందనలు తెలిపారు.

పాఠశాల కళాశాల అభివృద్ధికి సాయం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

అమెరికాలో స్థిర పడిన నార్త్ కరోలినా ప్రాంతానికి చెందిన ప్రవాసాంధ్రులు పాలపర్తి వాస్తవ్యులు తేళ్ళ రవితేజ, కాళహస్తి కీర్తి కుమార్తె కుమారి తేళ్ళ నిఖిత లు శుక్రవారం పెదనందిపాడు పి.ఎ.ఎస్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భముగా వారు కళాశాలలోని తరగతులను, గ్రంథాలయాన్ని, వ్యాయామశాల, ఎన్‌సిసి విభాగాన్ని, కంప్యూటర్ లాబ్స్, ప్లే గ్రౌండ్, కొత్తగా నిర్మిస్తున్న బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇదే కళాశాలలో తేళ్ళ రవి తేజ తండ్రి , అత్త చదువుకున్నారని గుర్తు చేసుకున్నారు అనంతరం నంది పాఠశాలకు కాళహస్తి కీర్తి రూ. 50 ,000, కళాశాల అభివృద్ధికి తేళ్ళ రవితేజ రూ. 50 ,000 ఆర్థిక సహాయాన్ని కళాశాల ట్రెజరర్ లావు ఆదిశేషయ్యకు అందజేశారు. ఈ సందర్భముగా వారిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రతాప్ కుమార్, ఎన్‌సిసి అధికారి డాక్టర్ పాతూరి శ్రీనివాస్, నంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఆఫీస్ ఇంచార్జ్ డి. లక్ష్మినారాయణ, కళాశాల, నంది పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు.



కళాశాల పాఠశాల అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న ప్రవాసాంధ్రులు

కెఎల్‌యులో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థులు క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారధివర్మ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని ఆర్అండ్‌డి హాలులో 2023-2024 విద్యాసంవత్సరం తరగతులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. బిటెక్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీ రంగంలో రాణించాలంటే సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం తప్పనిసరిగా అలవరచుకోవాలన్నారు. ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాంకేతిక సంస్కృతిని అలవరచుకోవాలని అన్నారు. రానున్న కాలంలో ప్రపంచం చూడబోయే అధునాతన టెక్నాలజీని ముందుగానే తమ విద్యార్థులకు పరిచయం చేసి ప్రపంచానికి అత్యంత ప్రతిభావంతులైన ఉద్యోగులను అందించడంలో రికార్డు తమ సొంతమని ధీమా వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ బిటెక్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులను అభినందించారు. పిల్లల పట్ల తల్లిదండ్రుల కలలను సాకారం చేయడం కోసం తమ అధ్యాపకులు నిరంతర కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.





హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న కెఎల్ వర్శిటీ వైస్ ఛాన్సలర్ పార్థ సారధివర్మ



పొగాకు ఉత్పత్తులతో నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని అల్లంవారిపాలెం జడ్పీ హైస్కూల్‌లో టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ట్రోఫీ కార్యక్రమం జరిగింది. వరల్డ్ యాంటీ టొబాకో డే లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నుదురుపాడు పిహెచ్‌సి సెంటర్ ఎంఒ డాక్టర్ సిహెచ్ యాని గ్రేస్ మాట్లాడారు. పొగాకు,పొగాకు ఉత్పతుల వాడకం వలన కేన్సర్ సోకడం, ఊపిరితిత్తులు పాడవడం వంటి ఆరోగ్య సమస్యల గురించి వివరిం చారు. ఎంపిహెచ్ఒ నూర్ద రాజు మాట్లాడుతూ పాఠశాల చుట్టూ 100 మీటర్ల దూరం వరకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం వాడడం చేయకూడదని వ్యక్తిగత శుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. ఎఎన్ఎం మహబున్నీస పాల్గొన్నారు.



ప్రార్థనా మందిరానికి లక్ష రూపాయల వితరణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో హల్లెలూయ ప్రార్థనా మందిరానికి తెలుగుదేశం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు శుక్రవారం లక్ష రూపాయల నగదును, 150 సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో తన విరాళంగా చర్చి నిర్వాహకులకు అందించారు. గతంలో కూడా ఇదే చర్చి నిర్మాణానికి రెండు లక్షల రూపాయలను అందజేసి, మరల లక్ష రూపాయల నగదు అందజేసిన ఆయనను ప్రార్థనా మందిరం సంఘస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, గ్రామ ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్రహ్మణ్యం, వి.అబ్రహం, తెలుగు యువత నాయకులు షేక్ నాగూర్ వలి, వి.రాజారావు, సిహెచ్ సురేష్, వి.బీముడు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి



రూరల్ గ్రామం కొలకలూరు లో వికలాంగురాలికి ట్రై సైకిల్ ను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందించారు. శుక్రవారం గ్రామం లో పర్యటించిన ఆయన కొలక లూరు గ్రామ పంచాయతి పరిధి లోని ఖాజీపేటకు చెందిన పామర్తి బ్రమయ్య కుమార్తె మల్లేశ్వరికి చేతన ఫౌండేషన్ వారి సహకారంతో ట్రై సైకిల్ ని అం దించారు. కార్యక్రమంలో నాయకులు ముసలయ్య, వి.సురేష్, ఏడుకొండలు, చేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ టెన్త్‌లో చేరే అవకాశం

ప్రజాశక్తి - రెంటచింతల

గత సంవత్సరంలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు మరల అదే తరగతిలో చేరెందుకు ప్రభుత్వం అవకాశం కలిపించిందని సత్తెనపల్లి డిప్యూటీ డిఇఒ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అలా చేరిన విద్యార్థులు పాఠశాలలో మిగిలిన విద్యార్థులు పొందే అన్ని ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో ఫెయిల్ అయిన విద్యార్థులు అందరినీ ప్రత్యక్షంగా కలిసి వారు మరల టెన్త్‌లో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో రెంటచింతల, కారంపూడి సహా 14 మండలాలు ఉన్నాయని 83 జిల్లా పరిషత్ పాఠశాలలో 66శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఇటీవల నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు 3,522 మంది విద్యార్థులు హాజరు కాగా 1,746 మంది పాసయ్యారని తెలిపారు. ఫెయిల్ అయిన 1776 మంది విద్యార్థులు అదే తరగతిలో పాఠశాలలో చేరి చదువుకోవచ్చని తెలిపారు.

జిన్నా టవర్ వద్ద నూతన జాతీయ జెండా

ప్రజాశక్తి-గుంటూరు



జాతీయ జెండాని గౌరవించడం ప్రతి ఒక్కరి భాధ్యత అని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. జిన్నాటవర్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా వర్షంలో తడిచి, రద్దీ కూడలిలో వాయు కాలుష్యం వలన దుమ్ము పట్టి ఉండటంపై అందిన ఫిర్యాదు మేరకు స్పందించి శుక్రవారం నూతన జెండాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు జిన్నా టవర్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా దుమ్ము పట్టి ఉన్నదని పలువురు ఫిర్యాదు చేశారని, వెంటనే పాత జెండా స్థానంలో నూతన జెండాను శుక్రవారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



రీ సర్వేపై సంయుక్త కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : వైస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు , భూరక్ష పథకం రీసర్వే జిల్లాలో అమలు జరుతున్న తీరుపై తెనాలి సబ్ కలెక్టర్, గుంటూరు ఆర్డీఒ, దుగ్గిరాల, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, మేడికొండూరు మండల తహసిల్దార్లు, సర్వే ఏడీ, మండల, గ్రామ సర్వేయర్లు, విఆఒలతో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పేజ్-2 భాగంగా 52గ్రామాలలో రీసెర్వే ప్రక్రియ చేపట్టామని, తెనాలి-6 గ్రామాలు, దుగ్గిరాల-4 గ్రామాలు, మేడికొండూరు-11 గ్రామాలు, వట్టిచెరుకూరు-13 గ్రామాలు, ప్రత్తిపాడు-6గ్రామాలు, పెదనందిపాడు-12 గ్రామాల్లో మొత్తంగా 1,11,399.67ఎకరాలలో రీసర్వే జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 10 గ్రామాల్లో సర్వే, బౌండరీస్ చట్టం ప్రకారం, సెక్షన్-13 నోటిఫికేషన్, తుది రెవెన్యూ రికార్డులు తయారీ పూర్తి అయ్యిందన్నారు. మిగిలిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయి వివిధ దశలో రీ - సర్వే ప్రక్రియ కొనసాగు తుందని చెప్పారు. ఈ సమీక్షలో రీ-సర్వే ప్రక్రియను ఆగస్టు నెల చివరకు పూర్తి చేసి, హద్దురాళ్లని పాతి, రైతులకు స్వచ్ఛమైన రెవెన్యూ రికార్డులు, భూహక్కు పత్రాల రూపంలో అందజేయాలని తెలియజేశారు. రీ- సర్వే ప్రక్రియపై ప్రతి విషయాన్ని పట్టాదారు లకు తెలియజేసి రీసర్వే పూర్తి చేయాలన్నారు. తహశీల్దారులను సర్వేయర్లను ఆదేశించారు.

బాలకృష్ణకు న్యూయార్క్‌లో ఘనస్వాగతం

ప్రజాశక్తి-గుంటూరు : న్యూయార్క్‌లో ఈనెల 7, 8, 9 తేదీల్లో జరుగుతున్న తానా సభలకు వెళ్లిన ప్రముఖ సినీ నటులు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు అమెరికాలో తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి, తానా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ రవి పొట్లూరి, నాట్స్ మాజీ ప్రెసిడెంట్ మన్నవ మోహనకృష్ణ, తానా కాన్ఫరెన్స్ అడ్వైజర్ జానీ నిమ్మలపూడి, సతీష్ మేక ఘనస్వాగతం పలికారు. న్యూయార్క్ విమనాశ్రయంలో మోహనకృష్ణ పుష్పగుచ్చాలు అందచేసి ఆహ్వానం పలికారు. అనంతరం భారీ ర్యాలీగా బాలకృష్ణను తీసుకెళ్లారు.



బాలకృష్ణకు పుష్పగుచ్చం ఇస్తున్న మన్నవ మోహనకృష్ణ

కార్పొరేటర్లతో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజా ప్రతినిధుల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీలను సంబందిత విభాగాధిపతులే ప్రత్యక్ష్యంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు గుర్తించి అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమాగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. ఆయా విభాగాధిపతులు కార్పొరేటర్లు ప్రతిపాదించిన వాటిలో మౌలిక వసతులకు సంబంధించిన వాటికి వెంటనే అంచనాలు సిద్ధం చేసి, ప్రతిపాదనలు పంపాలన్నారు.

టూవీలర్లు, ఆటోలు సర్వీసు రోడ్డులోనే ప్రయాణించాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రత నిబంధనలను రవాణా, పోలీసు, రహదారి శాఖల అధికారులు సమన్వయంతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఆరు నెలలతో పోల్చితే ప్రస్తుతం రహదారి ప్రమాదాల శాతం కొద్దిగా తగ్గిందని, పూర్తి స్థాయిలో రహదారి ప్రమాదాలు అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు మరింత మెరుగైన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తీసుకోవాలన్నారు. రహదారి భద్రత సూచనలపై వాహనదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిని గుర్తించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. గుంటూరు నుంచి బుడంపాడు మీదుగా తెనాలి వెళ్ళే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బ్లాక్ స్పాట్లను గుర్తించి వేగ నిరోధకాలతో పాటు సూచికల ఏర్పాటుకు ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై టూ వీలర్లు, ఆటోలు ప్రయాణించకుండా కేవలం సర్వీసు రోడ్డులోనే ప్రయాణించేలా రవాణా, పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపై సమీప ప్రాంతాల ప్రజలు వ్యర్థాలు వేయకుండా సంబంధిత ప్రాంతాల మున్సిపల్, పంచాయితీ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్. కరీం, ఆర్‌అండ్‌బి ఎస్.ఈ ఆర్.శ్రీనివాసమూర్తి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ పి.పార్వతీశం, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణ బాబు, జీజీహెచ్ సూపరింటెం డెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, యంటీయంసీ కమిషనర్ శారద దేవి, ట్రాఫిక్ డీఎస్పీ బాల సుందరం, జిఎంసి ఎస్.ఈ భాస్కరరావు పాల్గొన్నారు.

గుంటూరులో స్టాఫ్‌వేర్ కంపెనీ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్థానిక సిద్ధార్థనగర్ 2వ లైనులో ఎవరెస్టు ల్యాబ్స్‌ను ప్రారంభిస్తున్నట్టు సంస్థ అధినేత జగదీష్ అంబటి తెలిపారు. సంస్థ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇంజినీరింగ్ విభాగంలో గుంటూరు ముందు ఉందని తెలిపారు. అందువల్ల రోబోటెక్ టెక్నాలజీతో ఈకంపెనీని అమెరికాలోని తమ కంపెనీలతో అనుసంధానం చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. విప్రో, ఎఎన్‌జెడ్‌లో స్టాఫ్ వేర్ డెవలప్‌మెంట్‌లో నివశించడానికి,వీరి కెరీర్ అభివృద్ధికి తమసంస్థ కృషి చేస్తుందన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్సు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ వంటి విభాగాలనుంచి కొత్త గ్రాడ్యుయేట్లను



సమావేశంలోమాట్లాడుతున్న జగదీష్ అంబటి

నియమిస్తున్నట్టు తెలిపారు. రోబోటిక్స్ ఆపరేషన్ ద్వారా వ్యర్థపదార్థాలను రీసైక్లింగ్ పరిశ్రమ కోసం తమ సంస్థ పనిచేస్తుందన్నారు. అలాగే స్థానికంగా స్టాఫ్‌వేర్, హార్డ్‌వేర్ అభివృద్ధికి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ, జెన్నీఫర్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్లు, లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేటు వెంచర్లుగానీ, లేఅవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేనియెడల పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ బొంతపాడులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లేఅవుట్‌ని తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బొంతపాడులోని వెంచర్‌ని పరిశీలించి, రోడ్ విస్తరణ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటి ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరి, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని, రోడ్ల కొలతలను తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలన్నారు. అందుకు తగిన విధంగానే పట్టణ ప్రణాళిక అధికారులు



లేఅవుట్ కొలతలు తనిఖీ చేస్తున్న కమిషనర్

స్వయంగా పరిశీలించాలన్నారు. నిబందనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏ.సి.పి. అశోక్ కుమార్, టి.పి.ఎస్. సువర్ణ కుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెట్లను పెంచితేనే భూతాపం తగ్గేది

ప్రజాశక్తి - గుంటూరు

మొక్కలను నాటడంతోపాటు వాటి సంరక్షించడం ద్వారా చెట్ల సంఖ్యను పెంచాలని, అప్పుడే భూతాపం తగ్గుతుందని టిజెపిఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ అన్నారు. కాలేజీలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నానాటికి తరిగిపోతున్న చెట్లను సంపదను పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఇందులో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతలా తీసుకుని ఒక ఉద్యమం లాగా మొక్కలు నాటాలని, భావితరాలకు కాలుష్యం లేని పర్యావరణాన్ని అందించాలని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నిర్వహణాధికారి డాక్టర్. జె.వి.సుధీర్ కుమార్ మాట్లాడుతూ మన ముందు తరాల వారు వేసిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా మారి వాటి ఫలాలను మనం అను భవిస్తున్నామని, మన ముందు తరాల వారికి వారసత్వ సంపదగా మనం ఇచ్చే విలువైన బహుమతి ఇప్పుడు మొక్కలు నాటడమేనని చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి.సురేష్‌బాబు, సంస్కృత అధ్యాపకులు ఆర్.జయశైలజ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులకు కాలేజీ సెక్రటరీ-కరెస్పాండెంట్ కె.వీరబ్రహ్మం అభినందనలు తెలిపారు.



టిజెపిఎస్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రిన్సిపల్

సెయింట్ ఆన్స్‌లో వనమహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి పి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌ఎస్‌ఎస్ సహాయ నిర్వహక అధికారి అయిన డాక్టర్ జె.సుధీర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాలంటీర్లకు పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.



మొక్కలు నాటుతున్న వాలంటీర్లు, ప్రిన్సిపాల్ తదితరులు